క్లుప్తంగా

నేత్రదానం



సుశీలమ్మ కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందజేత

నెల్లూరు(అర్బన్) : కావలి పట్టణం వడ్డిపాళెంలో నివాసం ఉంటున్న గుంజి సుశీలమ్మ(80) ఆదివారం రాత్రి ఆమె నివాసంలో మృతిచెందారు. అభయం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు శ్రీవాణి, వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత సహకారంతో మృతురాలు సుశీలమ్మ నేత్రాలను జిల్లా ప్రభుత్వాస్పత్రికి దానం చేసేందుకు కుటుంబసభ్యుడు పాండు అంగీకరించారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ టెక్నీషియన్ సునీల్ మృతురాలి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచిన వారు 99595 89321(సునీల్), 99124 70094(దగ్గుశెట్టి హేమలత)ల నంబర్లకు సంప్రదించాలని కోరారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నెల్లూరు (పొగతోట) : కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని కలెక్టర్ ఆనంద్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీపీఎంలు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని అప్పయ్యకండ్రిగ గ్రామంలో కర్మక్రతువుల భవన నిర్మాణ పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అమంచర్ల సర్పంచ్ రమణమ్మ, ఉపసర్పంచ్ మల్లినేని వేణునాయుడు, టీడీపీ నేత వాక వెంకటేశ్వర్లు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అల్లాభక్షు పాల్గొన్నారు.

దళిత కుటుంబంపై టీడీపీ నేతల దాష్టీకం



చికిత్స పొందుతున్న కుమార్

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని ఓ దళిత కుటుంబంపై టీడీపీ వర్గీయులు కర్రలతో దాడి చేసి.. ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని.. లేకపోతే చంపేస్తామంటూ బెదిరించిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు.. హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇందిరమ్మకాలనీలో దళితులు పానకాల కుమార్, కళావతి దంపతులు పూరి గుడిసెలో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా, ఆ పార్టీ విజయానికి గత ఎన్నికల్లో కష్టపడ్డారు. వారి ఇంటి సమీపంలోనే నివాసం ఉంటున్న టీడీపీకి చెందిన సులోచన తన గృహం వద్ద వాహనాన్ని పార్క్ చేసి ఉన్నారు. ఈ తరుణంలో కుక్కను తరిమే క్రమంలో ఇటీవల ఆయన రాయి విసరగా, అది సులోచన వాహనానికి తగిలింది. పొరపాటున జరిగిందని కుమార్ చెప్పినా, పట్టించుకోకుండా సులోచన, ఆమె తల్లి, స్నేహితుడు వేణు కలిసి వారి ఇంటిపై దాడి చేశారు. కర్రలతో కుమార్, కళావతిని గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన కుమార్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పనిచేయడాన్ని ఓర్వలేకే దాడి చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదమని తెలిసినా..

- ఇళ్ల మధ్య ఎండుగడ్డి నిల్వలు
- రక్షణ చర్యలు చేపట్టని వైనం
- ఆందోళనలో స్థానికులు



ఇళ్ల మధ్యలో ఉంచిన వరి గడ్డి నిల్వలు

నెల్లూరు(అర్బన్) : ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. తరచూ పలు ప్రాంతాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతున్నాయి. అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని ప్రకటనలు చేస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం ఆ దిశగా చర్యలు కానరావడం లేదు.

ఖాళీ స్థలంలో..

స్థానిక బాలాజీనగర్‌లోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ రోడ్డులో జేఎస్ హైట్స్ అపార్ట్‌మెంట్‌ను ఆనుకుని అమెరికాలో నివాసముంటున్న ఓ వ్యక్తికి చెందిన విశాలమైన ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రే పెద్ద ఎత్తున వరి ఎండుగడ్డి నిల్వలు వచ్చి చేరాయి. లారీతో ఎవరో రాత్రి పూట తోలారని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డును ఆనుకుని ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో ఎండుగడ్డి నిల్వలు ఉంచడం, అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం, మండువేసవి కావడం వల్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దారిన పోయేవారెవరైనా పొగతాగి ముక్కలు పడేసినా, విద్యుత్తు వైర్ల నుంచి ఎమైనా రవ్వలు పడినా, శ్రీరామనవి పండుగ ఉత్సవం సందర్భంగా బాణసంచా రవ్వలు పడినా మంటలు చెలరేగే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

గడ్డిని తరలించాలి

"ఇక్కడి వరిగడ్డి నిల్వలు ఎవరివో తెలియడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగినా ఇక్కడ మంటలను ఆర్పేందుకు తగిన నీరు ఉండే బావులు కూడా లేవు. స్థలం గలవారు కూడా అమెరికాలో ఉంటున్నారు. ఇక్కడ గడ్డి వేసుకున్న వారు తగు రక్షణ చర్యలు తీసుకోవాలి. లేదంటే గడ్డిని తరలించాలి.
– రామకృష్ణ, స్థానికుడు

పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఈఈ శేషగిరిరావు



హాజరైన ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇంజినీరింగ్ అధికారులు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పన్ను పరిధిలోకి రాకుండా అక్రమంగా వాడుతున్న కుళాయిలను గుర్తించి నమోదు చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో అనధికార కుళాయి కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించడంలో అమెనిటీస్ కార్యదర్శులు బాధ్యత వహించాలని సూచించారు. సర్వేల ద్వారా గుర్తించిన అనధికార కనెక్షన్ల యజమానులకు నోటీసులు జారీ చేసి, పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో తాగునీటి సరఫరా పైపులైన్ల లీకేజీ వివరాలను వార్డు అమెనిటీస్ కార్యదర్శులు, ఫిట్టర్లు సంయుక్తంగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అన్ని డివిజన్లకు షెడ్యూల్ ప్రకారం జోనల్ సిస్టమ్ ప్రకారం తాగునీటి సరఫరా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ గిరిధర్, నగరపాలక సంస్థ ఈఈ శ్రీనివాసరావు, డీఈలు రఘురామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వాహనాల తరలింపు



సీఏఎం స్కూల్ ఆవరణలో ఉన్న వాహనాన్ని తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై నెలల తరబడి ఉన్న పలు వాహనాల తొలగింపు కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీసుల సహాయంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సోమవారం చేపట్టారు. నగరపాలక కమిషనర్ సూర్యతేజ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా రోడ్లపై నిరుపయోగంగా ఉన్న 113 వాహనాలను గుర్తించారు. వాటికి సంబంధించిన యజమానులకు తెలియజేసి తొలగించాలని ఆదేశించారు. స్పందించని వాహనాలను ట్రాఫిక్ పోలీసుల సమక్షంలో తొలగించేలా చర్యలు చేపట్టారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



కల్లూరుపల్లిలోని గోశాలలో జరుగుతున్న పనులపై ఆరాతీస్తున్న ఎంహెచ్‌ఓ

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 23వ వార్డును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎనిమిది బ్లాక్ స్పాట్స్‌లలో నాలుగింటిని పరిశుభ్రం చేసి గ్రీన్ స్పాట్స్‌గా మార్చారు. అనంతరం 24వ వార్డు కల్లూరుపల్లి టిడ్కో గృహ ప్రాంగణాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కల్లూరుపల్లి గోశాలలో పశువుల వివరాలు, జరుగుతున్న కార్యకలాపాలపై ఆరాతీశారు. అనంతరం స్థానిక ఏసీ మార్కెట్ అన్న క్యాంటీన్‌ను సందర్శించారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ రేపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్రైస్తవ సంఘ నేతలు, పాస్టర్లు

నెల్లూరు(బృందావనం) : పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఈనెల 9న నగరంలో శాంతియుత ర్యాలీని నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సంఘ నాయకులు తెలిపారు. వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్టు చర్చి డొనీహాల్లో ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు సుబేదారుపేటలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీసెంటర్ వరకు, అక్కడి నుంచి బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో ప్రజాస్వామ్యవాదులతో పాటు హిందువులు, ముస్లింలు పాల్గొని ఐక్యత చాటాలన్నారు.

అండాశయంలోని 3.5 కిలోల గడ్డ తొలగింపు

- పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ చేసి గడ్డను తొలగించిన డాక్టర్లు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి) గైనకాలజీ విభాగంలో ఓ మహిళకు శస్త్రచికిత్స చేసి అండాశయం నుంచి 3.5 కిలోల గడ్డను తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధురి సోమవారం ఆస్పత్రిలో వివరించారు. నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో నివాసం ఉంటున్న 50 ఏళ్ల నిరుపేద మహిళ కడుపు ఉబ్బరం, నొప్పితో శుక్రవారం ఆస్పత్రికి వచ్చిందన్నారు. తాము పరీక్షలు నిర్వహించగా మహిళ అండాశయంలో గడ్డ మెలికలు తిరిగినట్టు గుర్తించామన్నారు. దీంతో పరిస్థితిని పేషంట్‌కు వివరించి ఆపరేషన్ చేసి 3.5 కిలోల గడ్డను తొలగించామన్నారు. గడ్డతో పాటు గర్భసంచిని కూడా తొలగించామన్నారు. పేషెంట్ వేగంగా కోలుకుంటోందన్నారు. ఆపరేషన్‌కు అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్లు సురేష్, శివకుమార్‌లు సహకారం అందించారన్నారు. పెద్దాస్పత్రిలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందరికీ ఆరోగ్యం.. ప్రభుత్వ లక్ష్యం

- డీఎంహెచ్‌ఓ సుజాత



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ సుజాత



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జడ్జి



పీహెచ్‌పీ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో..

నెల్లూరు(అర్బన్) : ప్రజలందరికీ ఆరోగ్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌బీటీ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యం, మాతా శిశు సంరక్షణకు ప్రాధాన్యత తప్పనిసరి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ జరిగింది. అనంతరం నిర్వహించిన సదస్సులో డీఎంహెచ్‌ఓ సుజాత మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డెమో అధికారి కనకరత్నం, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు రీణాభారతి, కుసుమకిరణ్, డీపీహెచ్‌ఎన్‌ఓ మంజుల, పీఎంపీ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ పాల్గొన్నారు.

➡ పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన, అణగారిన వర్గాల ప్రజలకు ఆరోగ్యం అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండడం, పౌష్టికాహారం తీసుకోవడం, కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలకు దూరంగా ఉండటం, ఒత్తిడిని తగ్గించుకోవడం, తగిన వ్యాయామం చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా పాల్గొన్నారు

➡ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందని గైనకాలజిస్ట్ పసుపులేటి వసుమతి అన్నారు. నెహ్రూ యువకేంద్రం, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చైతన్యపురిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిచ్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ర్యాలీ చేశారు. పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నెహ్రూ యువకేంద్రం యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి, నర్సింగ్ కళాశాల కరెస్పాండెంట్ దుర్గారెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్

- ఇబ్బందుల్లో రోగులు

నెల్లూరు(అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎన్టీఆర్ వైద్యసేవలకు ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు నాలుగు నెలల నుంచి పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందనలేకపోవడంతో ఏపీ స్పెషాలిటీస్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలను ఆస్పత్రుల యాజమాన్యాలు బంద్ చేశాయి. దీంతో ఆయా ఆస్పత్రుల్లో ఆరోగ్యమిత్రలు లేక ఎన్టీఆర్ వైద్య సేవా రిజిస్ట్రేషన్ రూములు ఖాళీగా దర్శనమిచ్చాయి.

అత్యవసర సేవలకు మినహాయింపు

అయితే రోగులకు అవసరమయ్యే అత్యవసర సేవలను సమ్మె నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు మినహాయించాయి. ప్రమాదాలు, తీవ్ర అస్వస్థత వచ్చిన రోగులను మాత్రమే ఆస్పత్రుల్లో చేర్చుకున్నారు. మిగతా వారు ఉసూరు మంటూ వెనుతిరిగారు.

ఈ-వ్యర్థాల తొలగింపు అనివార్యం

నెల్లూరురూరల్ : ఈ-వ్యర్థాలను తొలగించుకోకుంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పాటు పర్యావరణానికి హాని కలిగిస్తాయని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈ-వ్యర్థాలు తొలగింపుపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణతో కలిసి వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందడంతో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ-వేస్ట్) పర్యావరణానికి పెద్ద సవాలుగా మారాయన్నారు. ప్రజలు ఈ-వ్యర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

గొలుసు దోపిడీ

నెల్లూరు(క్రైమ్) : బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు తెంపుకెళ్లిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం మార్కండేయ కాలనీకి చెందిన పద్మావతి ఈనెల ఐదో తేదీన తన సోదరునితో కలిసి నెల్లూరు నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ప్రశాంతినగర్ స్విమ్మింగ్ పూల్ దాటి బైక్ తిప్పుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని మూడుసవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. నిందితుడి మొహం గుర్తుపట్టకుండా హెల్మెట్ ధరించి ఉన్నాడు. ఈమేరకు బాధిత మహిళ ఈనెల 6న నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్) : డిగ్రీ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రాణాప్రమోద్‌రెడ్డి తెలిపారు. స్థానిక కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎస్సీలో రుక్సానా 10కి 10 పాయింట్లు, జోయల్ సునద్ 9.9, రచన 9.8, రాజేశ్వరి 9.6, బీసీఏలో సుజన, చెంచుశ్రావ్య, వాసవి, విష్ణుప్రియలకు 9.6, మధు, విజయలక్ష్మి, షమియాబాను 9.5, బీకామ్‌లో మొబిషారా 9.7, పఠాన్ యాస్మిన్ 9.5, శివశంకర్ 9.2, బీబీఏలో రుక్మిణి వెన్నెల 9.4, అక్షిత 9.1 పాయింట్లు సాధించారన్నారు. డీన్ సుధారాణి, అడ్మిన్‌డీన్ రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపల్ నాగయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ రమణయ్య, రాజేష్‌రెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

13 ప్రాంతాల్లో చలివేంద్రాలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా 13 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలకు గడువులోపు పరిష్కారం అందించాలని ఆదేశించారు. కాగా విభాగాల వారీగా ఇంజినీరింగ్– 6, హౌసింగ్– 12, టౌన్ ప్లానింగ్– 14, రెవెన్యూ– 8, అకౌంట్స్– 3, ఆప్కాస్– 5, ఎస్టాబ్లిష్‌మెంట్– 4 ఇలా మొత్తం – 52 ఫిర్యాదులను అందుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. అదనపు కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ విభాగం ఈఈ శేషగిరిరావు, రహంతు జానీ, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, ఇన్‌చార్జి సిటీప్లానర్ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

పెన్షనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు బీవీనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో జరుగనుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి సోమవారం తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం విచ్చేసి సూచనలు, సలహాలు అందజేస్తారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ బిల్ (పెన్షన్స్) 2025, 2025–2026 ఆదాయ పన్ను వివరాలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి పెన్షనర్లు, సంఘ బాధ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆక్రమణలను తొలగించుకోండి

నెల్లూరు(బారకాసు) : నగరంలో ప్రధాన రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, ఇతర నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే వాటిని తొలగిస్తామని కమిషనర్ సూర్యతేజ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 28వ డివిజన్ జర్నలిస్ట్ కాలనీ, కేశవులునగర్, వేదాయపాళెం కూడలి, గాంధీనగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎన్టీ రోడ్డు, పొదలకూరు రోడ్డు, మినీబైపాస్‌రోడ్డులోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కుదింపునకు గురై, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అంతరాయంగా ఉన్న విషయాన్ని గుర్తించామని తెలిపారు. ఈ క్రమంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా రోడ్డు మార్జిన్‌ను పూర్తిగా వదిలేయాలని సూచించారు. జర్నలిస్టు కాలనీలోని ప్రజాపార్కులో అవసరమైన జిమ్ పరికరాలను త్వరలో అందజేస్తామని తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధి చెక్కసాయి సునీల్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మదన్‌మోహన్, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

సింహపురిలో ఆధ్యాత్మిక శోభ



మల్లేశ్వరస్వామి ఆలయంలో..



ఆంజనేయస్వామి ఆలయంలో సింహవాహన సేవ



కోదండరామునికి పల్లకిసేవ



హంస వాహనంపై కోదండరాముడు

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

➡ నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వి.కార్తికేయశర్మ, ఏఆర్ మల్లికార్జునశర్మ శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా పంచాగ్నుల మనోజ్‌కుమార్ వ్యవహరించారు. ఈఓ బి.మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

➡ ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి అంకురార్పణ గావించారు. ఉభయకర్తలుగా మేడా మల్లికార్జునరావు– మల్లీశ్వరి, కామేశ్వరరావు– విద్య దంపతులు వ్యవహరించారు. ఈఓ దుర్గయ్య పర్యవేక్షించారు.

➡ సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు సోమవారం రాత్రి సింహవాహన అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా నాగసతీష్– భానుమతి దంపతులు వ్యవహరించారు. ఈఓ పి.రఘురామయ్య పర్యవేక్షించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సోమవారం ఉదయం ధ్వజారోహణ, గరుడ హోమం, విష్వక్సేన పూజ, కొడిముద్ద ప్రసాద వితరణ నిర్వహించారు. రాత్రి స్వామివారు హంసవాహనంపై భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా మెంటా వెంకటకిరణ్‌కుమార్– కోమలి దంపతులు వ్యవహరించారు. నిర్వాహకులు అమరా మోహన్‌రావు, తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్, ఎస్.హనుమంతరావు పర్యవేక్షించారు.

➡ మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి అంకురార్పణ గావించారు. ఉభయకర్తలుగా పుట్టా శ్రీనివాసులురెడ్డి– వెంకటసౌజన్య దంపతులు వ్యవహరించారు. మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

➡ వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో సీతారామస్వామికి తిరుమంజనం సేవ, అభిషేకం, ఊంజల్‌సేవ, రాత్రి శేషవాహనసేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా మస్తానయ్య– కృష్ణవేణి, మహిధర్– అర్చన దంపతులు వ్యవహరించారు.